46)గుండక్రియ

ప|| జయమంగళము నీకు సర్వేశ్వర | జయమంగళము నీకుజలజవాసినికి ||

చ|| శరణాగతపారిజాతమా | పొరి నసురలపాలిభూతమా |
అరుదయిన సృష్టికి నాదిమూలమా వో- | హరి నమో పరమపుటాలవాలమా ||

చ|| సకలదేవతాచక్రవర్తి | వెకలిపై నిండినవిశ్వమూర్తి |
అకలంకమైనదయానిధి | వికచముఖ నమో విధికివిధి ||

చ|| కొలిచినవారలకొంగుపైడి | ములిగినవారికి మొనవాడి |
కలిగినశ్రీవెంకటరాయా | మలసి దాసులమైనమాకు విధేయా ||